

# అనగనగా ఒక పుణ్యవతి

"అసిద్ధం... అసిద్ధం...!"

కర్ణకఠోరంగా వినిపించాయి పుణ్యవతి కేకలు. అశ్వత్థామకి మెలకువ వచ్చింది.

'పొద్దున్నే ఈ ముసలమ్మకి నాతో ఏం పని పడిందో' అని గొణుక్కున్నాడు. కమ్మగా నిద్రపోతున్న వాడిని డిస్టర్బ్ చేసినందుకు అతనికి పుణ్యవతి మీద చికాకు కలిగింది.

కాని లేవక తప్పదు. తను లేచి వెళ్ళేవరకు 'అసిద్ధం...అసిద్ధం...' అని కేకలు పెడుతూనే వుంటుంది. అశ్వత్థామ బ్రహ్మచారి కావడంతో ఇంటి యజమానురాలి హోదాలో అతనిమీద పెత్తనం చెలాయిస్తూ వుంటుంది. పుణ్యవతి ఒంటరి జీవితం గడుపుతోంది. భర్త చనిపోయాడు. కూతుర్ని కష్టపడి చదివించితే తల్లిని ఎదిరించి ఇంటర్‌కేస్ట్ మ్యారేజీ చేసుకుని దుబాయి వెళ్ళిపోయింది. ఇక అప్పట్నుంచి కూతురితో సంబంధాలు లేవు. తనకు జీవితాంతం తోడుగా వుండాల్సిన కూతురు తన స్వార్థం, సుఖం చూసుకుని వెళ్ళిపోయినా పుణ్యవతి దిగులుపడలేదు. నిశ్చింతగా బతుకుతోంది. తన ఇంట్లో అద్దెల కుంటున్న కుటుంబాల బాగోగులు చూస్తూ సందడిగా తిరుగుతూ వుంటుంది.

పుణ్యవతి తమ్ముడు రంగయ్య తాపీమేస్త్రీ తను సంపాదించిందంతా తాగుడికి తగలెయ్యడమే గాక, అప్పుడప్పుడూ అక్క దగ్గరకొచ్చి డబ్బుకోసం పీడిస్తుంటాడు.

"ఒక్కదానివి, డబ్బంతా ఏం చేసుకుంటావే ! ఇంటద్దెలు, పాలడబ్బులన్నీ కూడ బెట్టి కట్టుకుపోతావా? నువ్వు పోతే నీ ఆస్తంతా నాదేనే. నిన్ను తగలేసేది, దినం చేసేది నేనే. గుర్తెట్టుకో" అని నోటికొచ్చినట్లు తిడుతుంటాడు.

"పోరా తాగుబోతెదవా ! తాగి తాగి ఎప్పుడో రోడ్డు పక్కన దిక్కులేని చావు చస్తావురా ! నాకంటే ముందు నువ్వే పోతావురా !" అన తమ్ముడిని దీవిస్తుంటుంది.

తన ఆరోగ్యంమీద అంత భరోసా ఆమెకు. పుణ్యవతికి అరవై ఏళ్ళు దాటి వుంటాయి. చెంపల దగ్గర కొంచెం నెరిసిందిగాని, జుట్టంతా నల్లగానే వుంది. పళ్ళు గట్టిగా రాళ్ళమాదిరి వున్నాయి. భోజనం చేశాక తమలపాకులు వేస్తుంది. అప్పుడు వక్క నోట్లో పెట్టుకుని పట పట కొరుకుతుంటే ఆ శబ్దం బైటకు వినిపిస్తుంటుంది. ఎప్పుడూ బొంగరంలా తిరుగుతూనే వుంటుంది. గేదెలకు మేతవేస్తూనో, పేడకళ్ళు ఎత్తుతూనో, పాలుపితుకుతూనో, పిడకలు కొడుతూనో కనిపిస్తూ వుంటుంది. గేదెల్లో గేదెలా కలిసిపోయి యమస్ట్రాంగ్‌గా కనిపిస్తుంది. ఆమెకు అరవై ఏళ్ళని చెప్తే నమ్మడం కష్టం.

భర్త చనిపోయాక ఇంటిచుట్టూ కాంపౌండ్ వాల్ కట్టించి, గోడవారగా కొన్ని గదులు కట్టించింది. వాటిని అద్దెలకిస్తుంది. అద్దెలకుంటున్న వాళ్ళంతా ఆటోడ్రైవర్లు, తోపుడు బళ్ళమీద వ్యాపారాలు చేసుకుంటున్న వాళ్ళు. చిన్న చిన్న జాబ్స్ చేసుకుంటున్నా వాళ్ళూను.

అశ్వత్థామ చిరుద్యోగి. గది సౌకర్యంగా, చౌకగా అద్దెకు దొరకడంతో అక్కడే సెటిలైపోయాడు. పుణ్యవతి డబ్బు లావాదేవీలు అతనే చూస్తుంటాడు. ఎవరికైనా అప్పు ఇస్తే ప్రాంసరీ నోట్లురాసి స్టాంపుల మీద సంతకాలు తీసుకోవడం. బ్యాంకులో డబ్బు వెయ్యడం, తియ్యడం అన్నీ అతని ద్వారానే.

అశ్వత్థామ ముఖం కడుక్కుని వచ్చాడు.

"ఏందమ్మా పొద్దున్నే" అన్నాడు.

"ఆచారి డబ్బిచ్చేశాడయ్యా ! బేంకీలో ఏసెయ్" అని డబ్బు, పాస్‌బుక్ అతనికి ఇచ్చింది.

పుణ్యవతితో అశ్వత్థామకి పేచీ ఏంలేదుగాని తన పేరు నోరు తిరక్క 'అసిద్ధం' అని పిలవడమే అతనికి కంపరం కలిగించే విషయం.

'బాబు' అని పిలవమటే నవ్వుతుంది.

"ముదురు బెండకాయవి నువ్వు బాబేంటి?" అని చురకలేస్తుంది.

గదుల్లో అద్దెలకుంటున్న ఆడవాళ్ళు 'పెద్దమ్మా !' అని ఆప్యాయంగా పిలుస్తారు. తమ కష్టసుఖాలు చెప్పుకుంటారు. కాని మగవాళ్ళే 'పీనాసి ముసిల్ది' అని తిట్టుకుంటారు.

'డబ్బంతా కూడబెట్టి తమ్ముడి ఎదాన పొయ్యాల్సిందే. ఇక ఎవరున్నారు దీనికి? ఇదిపోయాక ఆడు ఆస్తంతా హారతి కర్పూరంచేస్తాడు' అని శాపనార్థాలు పెడుతుంటారు. దానికి కారణం లేకపోలేదు. డబ్బు విషయంలో ఖచ్చితంగా వ్యవహరిస్తుంది. సమయానికి డబ్బివ్వకపోతే పెద్దగా అరుస్తుంది. 'ఇల్లు ఖాళీచెయ్యి' అని బెదిరిస్తుంది.

'నీ పెళ్ళాం పిల్లలు మొఖంచూసి వూరుకుంటున్నా, లేకపోతే ఇంట్లో సామాను వీధిలోకి విసిరేసేదాన్ని' అని వార్నింగులు ఇస్తుంది. అందుకే మగవాళ్ళకి మంట.

అయితే ఆడవాళ్ళని, పిల్లల్ని గమనిస్తుంటుంది. అన్నీ ఆరాలు తీస్తుంటుంది. అద్దెలకుంటున్న కుటుంబాల వాళ్ళంతా అన్నం వండుకున్నారా లేదా? పిల్లలు బడి కెళ్తున్నారా లేదా? వాళ్ళకి పుస్తకాలున్నాయా లేవా? బాగా చదువుతున్నారా? అని అడిగి తెలుసుకుంటుంది. ఎవరికైనా అనారోగ్యం కలిగితే 'డాక్టర్ దగ్గరకు ఎందుకు వెళ్ళలేదని?' కేకలేస్తుంది. బొడ్లో నుంచి సంచితీసి ఎంత డబ్బు కావాలో అడిగి ఇస్తుంది. ఆడవాళ్ళొచ్చి బియ్యం లేవన్నా, పొయ్యిలోకి కట్టెలు లేవన్నా సహాయం చేస్తుంది.

అశ్వత్థామకి పుణ్యవతి కేరెక్టర్ ఏమిటో అర్థంకాదు. ఒంటరి ఆడది. ఖర్చులకు ఎంత కావాలి? డబ్బు డబ్బు అని అందర్నీ పీడించటం ఎందుకో? ఏం? కట్టుకుపోతుందా అనుకుంటాడు. మనిషి తాపత్రయమేగాని, రోజుగడవడానికి ఎంత డబ్బు కావాలి? డబ్బుపోగుచేసి బ్యాంకులో దాచుకుంటే, అదేం ఆనందమో, అని చిరాకుపడతాడు.

ప్రతిరోజూ డబ్బుకోసం ఎవర్నో ఒకర్ని తిడుతూ వుండడం, ఎప్పుడిస్తావ్? ఇస్తావా? చస్తావా? అని గొంతుమీద కూర్చోవడం చూసి చూసి ఒకరోజు పుణ్యవతిని నిలదీశాడు అశ్వత్థామ.

"ఎందుకమ్మా డబ్బు డబ్బని జనాన్ని పీడిస్తావు? హడలి ఛస్తున్నారు నిన్ను చూసి. అద్దెకుండేవాళ్ళెక్కడికి పోతారు? ఇవాళ కాకపోతే, రేపిస్తారు. వాళ్ళివ్వాలి నువ్వు తినాలని లేదుగా. నీ దగ్గరే బోలెడు డబ్బు మూలుగుతుందిగా?"

పుణ్యవతి పకపక నవ్వింది.

"ఆ ఎదవల సంగతి తెలీదు నీకు. నేనేమాత్తరం సందిచ్చినా నెత్తినెక్కుతారు. ఆళ్ళు డబ్బు సంపాదిస్తారు. డబ్బంతా తాగుడికి తగలేత్తారు. నేను ఎంటబడి అరవకపోతే పెళ్ళాం, పిల్లలకి కూడు గూడా పెట్టరు తెలుసా? అందుకని ఎవడి దగ్గరా రూపాయి వదలను. తాగుడు జబ్బులేకపోతే అంతా బాగుంటారు. ఏంటో నా చిన్నప్పుడు తాగినోడు

కనిపించేవోడు కాదు. ఇప్పుడేంటో రాత్రీ పగలు తేడా లేదు. తాగి తూలే వాళ్ళే ఎక్కడ చూసినా. ఈ జనమలో బాగుపడరీ ఎదవలు" అన్నది.

ఆమెకున్న లోకానుభవం తనకు లేనందుకు సిగ్గుపడ్డాడు అశ్వత్థామ. ఆమెకు చదువులేకపోయినా లోకంలో జనాల బతుకులు చదివిన అనుభవం వుంది. దాంతోనే ఆమె ఎవరు ఎటువంటివాళ్ళో అంచనా వేస్తుంది అనుకున్నాడు.

ఒక రోజు రంగయ్య, తన భార్య రుక్కమ్మని వెంటబెట్టుకుని వచ్చాడు. అప్పుడు తాగిలేడు. పెద్దమనిషి మాదిరి పంచెకట్టుకుని, లాల్చీ వేసుకున్నాడు. భుజంమీద టర్కీ టవలుంది. ఎప్పుడూ తాగి, మాసిపోయిన బట్టల్లో వచ్చే తమ్ముడు శుభ్రంగా స్నానంచేసి మంచి బట్టలు కట్టుకుని వచ్చేసరికి పుణ్యవతి సంతోషించింది.

"రావే ! చాలారోజులైంది నిన్ను చూసి" అన్నది మరదల్ని లోపలకు ఆహ్వానిస్తూ.

"ఎక్కడొదినా? తీరికేది?" అన్నది రుక్కమ్మ పీటమీద చతికిలబడి. పుణ్యవతి పెట్టిన టిఫిన్ తిని, టీ త్రాగి అసలు సంగతి బైటపెట్టారు.

"లక్ష్మికి సంబంధం కుదిరిందొదినా !"

"అబ్బాయి సిమెంటు ఫ్యాక్టరీలో పనిచేస్తాడు. స్వంత ఇల్లు, వాకిలీ వున్నాయి" అని అతని జీతం వివరాలు చెప్పాడు రంగయ్య.

"పోన్లే నీ కూతురు సుఖంగా వుంటే అంతే చాలు" అన్నది పుణ్యవతి.

"నువ్వే ఒక చెయ్యి వెయ్యాలి వదినా !" అన్నది రుక్కమ్మ.

"సర్లేవే ! లగ్గాలు పెట్టుకోండి. చూద్దాం."

"అట్టా అంటే కాదు. ఏభైవేలు కావాలి."

"ఏభైవేలా?"

"పోనీ అప్పుగా ఇవ్వు !" అన్నాడు రంగయ్య.

"అప్పుగానే ఇస్తాలే ! తర్వాత బాకీ ఎట్టా తీరుత్తావురా !" అని నిలదీసింది పుణ్యవతి.

రంగయ్య నీళ్ళు నమిలాడు. రుక్కమ్మ మొగుడివైపు తీవ్రంగా చూసింది. అప్పుగా ఇవ్వమని తొందరపడి అడగడం ఆమెకు నచ్చలేదు. ఒంటరి మనిషి, బోలెడు ఆదాయం ఏంజేసుకుంటుంది? మేనకోడలి పెళ్ళికి ఆ మాత్రం డబ్బిస్తే ఏం? ఇదీ రుక్కమ్మ ఉద్దేశ్యం.

"తాపీ మేస్త్రివి. రోజూ రెండొందలు సంపాదిత్తావు. తాగుడికి తగలేస్తావు. రేపనేది వుండాలి. అది లేకపోబట్టే గదా పిల్ల పెళ్ళికి దెబెరిత్తన్నావు" అని తమ్ముడికి చీవాట్లు పెట్టింది.

"రుక్కమ్మ ఓపిగ్గా అట్లుపోసీ, ఇడ్లీలమ్మీ రెక్కలు ముక్కలు చేసుకుని ఇల్లు గడుపుతోంది కాబట్టి సరిపోయింది. లేకపోతే కుక్కబతుకు నీది" అన్నది.

రంగయ్యకి తలవాచిపోయింది. తాగిలేదు కాబట్టి సరిపోయింది. లేకపోతే ఎదురు తిగిరి బూతులు తిట్టేవాడు. అందులోనూ అవసరం తనది కాబట్టి కిక్కురుమనకుండా భరించాడు.

"మీ ఇల్లు తాకట్టుపెడితే డబ్బిస్తా !" మొగమాటం లేకుండా తేల్చిచెప్పింది పుణ్యవతి.

మొగుడూ, పెళ్ళాలు దూరంగా వెళ్ళి గుసగుసలాడారు.

"ఇల్లు తాకట్టుపెడితే బేంకోళ్ళియ్యరా? మీ అక్క ఇచ్చేదేంది బోడి" అన్నది రుక్కమ్మ.

"నీ మొకం లేవే ! బాకీ కట్టకపోతే బేంకోళ్ళు ఇల్లు ఏలం ఏత్తారు తెలుసా? మా అక్కతో పేచీ ఏ వుంది? అది చచ్చాక ఆస్తంతా మనదేగా?" అని నవ్వాడు రంగయ్య. రుక్కమ్మకి మొగుడి లాజిక్ నచ్చింది కాని "మీ అక్క కూతురొస్తే" అనే అనుమానం వ్యక్తం చేసింది.

"అదెప్పుడో దుబాయ్ పోయింది. రాదు" అని తేల్చాడు రంగయ్య.

మర్నాడు ఇంటి డాక్యుమెంట్లు దగ్గర పెట్టుకుని అశ్వత్థామతో ప్రాంసరీ నోటు రాయించి సంతకాలు పెట్టించి డబ్బు ఇచ్చింది పుణ్యవతి.

"ఒరేయ్ ! ఇప్పుడ్నుంచైనా బుద్ధిగా వుండు సంపాదనంతా తాగుడికి తగలెయ్యకు. ఇప్పుడే చెప్తున్నా ! నెలనెలా వడ్డీ తెచ్చియ్యాలి. తెల్సిందా?" అని తమ్ముడికి వార్నింగ్ ఇచ్చింది.

'నీ మొకంలేవే ! వడ్డీ ఇయ్యాలా? వడ్డీ, అసలుకే గతిలేదు' అని మనసులో అనుకుని "అట్టాగే లేవే" అని డబ్బుచ్చుకుని బయల్దేరాడు రంగయ్య.

రంగయ్య కూతురు పెళ్ళిచేసి చేతులు దులుపుకున్నాడుగాని ఒక్క నెలన్నా అక్కడి వడ్డీ డబ్బులు ఇచ్చిన పాపాన పోలేదు. సంవత్సరాలు గడిచిపోతున్నాయి. అక్కపోతే ఆస్తి తనకే దక్కుతుందనే ధీమాతో తిరుగుతున్నాడు.

పుణ్యవతీ అప్పుడప్పుడు తమ్ముడింటికి పోయి బాకీ గుర్తుచేస్తోంది. అక్క రాక గమనించి రంగయ్య దొడ్డి వాకిట్లోంచి పారిపోతున్నాడు. రుక్కమ్మ వేడివేడిగా అట్లుపోసిచ్చి, తన బాధలు చెప్పుకుని ఏడ్చేది. ఆమె తమ్ముడిని తిట్టి, శాపనార్థాలు పెట్టి మరదల్ని ఓదార్చి ఖాళీ చేతులతో తిరిగి వచ్చేది.

రోజులన్నీ మనవి కాదన్నట్లు ఉక్కుముక్కలా వుండే పుణ్యవతి పీనుగులా అయి పోయింది. షుగర్, బీపీ, కీళ్ళనొప్పులతో బాధపడుతోంది. గేదెలన్నీ అమ్మేసి అన్నపూర్ణ వృద్ధాశ్రమంలో చేరింది. ఇక తను ఎక్కువ రోజులు బతకనని తెలుసుకుంది. చివరి

రోజుల్లో ఒక్కసారి కన్నకూతుర్ని చూడాలనే కోరిక కలిగింది. వాళ్ళ అద్దెలన్నీ వసూలుచేసి ఆమె బ్యాంక్ ఎకౌంట్‌లో జమచేస్తున్నాడు అశ్వత్థామ.

"మీ అక్కపోయేటట్టుంది. ఆస్తి నీ పేరున రాయించుకో ఎందుకైనా మంచిది. దుబాయ్ నుంచి కూతురొస్తే ఏంచేస్తావు? అది మనకి దక్కనిస్తుందా? అప్పుడు మనకేం హక్కుంటుంది?" అని మొగుడికి సలహా చెప్పింది రుక్కమ్మ.

"దాని మొకం. అదెందుకు వస్తుందే. దుబాయ్‌లో మొగుడూ పెళ్ళాలూ తెగ సంపాదించేస్తున్నారు" అన్నాడు రంగయ్య.

"అది కాదయ్యా ! డబ్బెవరికి చేదు చెప్పు. ఆశ్రమంలో పన్జేసే వెంకటమ్మ చెప్పింది మీ అక్క కూతురో, కూతరో అని కలవరిస్తోందట. మేనేజర్ ఆమె అడ్రస్ కోసం తిరుగు తున్నాడంట" చెప్పింది రుక్కమ్మ.

"ఆ సంగతి నాకు తెలుసులేవే ! దాని అడ్రసు నన్నూ అడిగారు. నాకేం తెలుసన్నా !" అని నవ్వాడు రంగయ్య.

"నవ్వేవులే పెద్ద మొనగాడివి. వెనకటికి నా కోడి, కుంపటి లేకపోతే తెల్లారదని పూరిమీద అలిగిందట నీలాంటిదే ముసలమ్మ. నువ్వు చెప్పకపోతే వాళ్ళు తెలుసుకోలేరా! ఏనుగులదార్లు ఏనుగుల కుంటాయ్. చీమలదార్లు చీమలకుంటాయ్ !" అన్నది రుక్కమ్మ.

రుక్కమ్మ అనుమానించినట్లే జరిగింది. పుణ్యవతి అల్లుడింటి అడ్రసు చూచాయగా చెప్తే ఆశ్రమ నిర్వాహకులు వెళ్ళి అల్లుడి తండ్రిని కలుసుకుని దుబాయ్ అడ్రసు తెలుసు కున్నారు. పుణ్యవతి కూతురు సీతతో ఫోన్‌లో మాట్లాడారు. ఆమె తల్లికి సీరియస్‌గా వుందనీ, అన్నపూర్ణ వృద్ధాశ్రమంలో వున్నదనీ, వెంటనే రమ్మని చెప్పారు.

సీత, ఆమె భర్త సుధాకర్ దుబాయ్ నుంచి బయల్దేరివచ్చారు. కాని పుణ్యవతికి కూతుర్ని కడసారి చూసే అదృష్టం లేకపోయింది. ఆమె చనిపోయింది కూతుర్ని చూడ కుండానే.

సీత తల్లి మృతకళేబరాన్ని చూడగలిగింది. అల్లుడు ఆమెకు కర్మకాండలు నిర్వ హించాడు. పుణ్యవతి అల్లుడు మంచివాడే అని అంతా మెచ్చుకున్నారు.

తర్వాత సుధాకర్ అత్తగారి ఆస్తి గురించి అరా తీశాడు. పుణ్యవతి ఇల్లు ఇప్పుడు మంచి సెంటర్లో వుంది కదా అమ్మేస్తే ఎన్ని లక్షలు వస్తాయిన ఎంక్వయిరీ మొదలు పెట్టాడు. అది తెలిసిన రంగయ్య మండిపడ్డాడు.

"మా అక్క కూతుర్ని లేవదీసుకుపోయావు. ఇన్నాళ్ళూ అది చచ్చిందా? బతికుందా? అని గూడా చూడనోడివి, ఇప్పుడొచ్చి ఆస్తి కావాలంటావా? కుదరదు. ఇన్నాళ్ళూ మా అక్క బాగోగులు మేమే చూశాం. ఆస్తి మాకే చెందుతుంది" అని దెబ్బలాడాడు.

"నీదెట్లా అవుతుంది బాబాయ్ ! మా అత్త నీకేమైనా రాసిచ్చిందా? చూపెట్టు" అని సవాల్ విసిరాడు సుధాకర్.

"నీ సంగతి నాకు తెలియదనుకోకు మావా ! మా అమ్మ బతికినన్నాళ్ళు డబ్బు కోసం పీడించుకుని తిన్నావు. చచ్చాక గూడా వదలవా? తల్లి ఆస్తి కూతురికి రాకుండా పోతుందా?" అని పోట్లాడింది సీత. విషయం కులపెద్దల దగ్గరకు చేరింది. ఆస్తి గొడవ పంచాయితీలో తేల్చాలి అనుకున్నారు.

రుక్కమ్మకు పరిస్థితి అర్థమైంది ! మనకు ఆస్తి దక్కేట్లులేదు. కూతురికివ్వకుండా మనకివ్వమని పంచాయితీలో పెద్దలు ఎట్టా చెప్తారయ్యా? ఇల్లు వాకిలి కూతురికే చెందు తుందని అంటారు. వాళ్ళు అంతా అమ్ముకుని దుబాయ్ పోతారు. అందుకని ఎంతో కొంత ఇప్పించమని అడుగు. చచ్చినోడి పెళ్ళికి వచ్చిందే కట్నం అని కొంతైనా దక్కుతుంది' అని మొగుడికి సలహా చెప్పింది. రంగయ్య కులపెద్దల్ని కలిసి తనగోడు చెప్పుకున్నాడు. పంచాయితీలో చూద్దాంలే అన్నాడు వాళ్ళు.

పుణ్యవతి డబ్బులావాదేవీలన్నీ ఆమె ఇంట్లో అద్దెకుంటున్న అశ్వత్థామకి పూర్తిగా తెలుస్తాయని అతనికి కబురు చేశారు పంచాయితీకి రమ్మని.

"పుణ్యవతి ఇంటి డాక్యుమెంట్లు బ్యాంకులో దాచుకున్న డబ్బు వివరాలు కావాలండీ" అని అశ్వత్థామ రాగానే అడిగారు.

"ఎందుకు అవన్నీ?" అని అడిగాడు అశ్వత్థామ.

"ఆమె ఆస్తి గురించి కూతురు, తమ్ముడు గొడవపడుతున్నారు. మేము పంచాయితీలో సెటిల్‌మెంట్ చేస్తాం" అన్నారు.

"ఆమె ఆస్తి ఆమె సెటిల్‌మెంట్ చేసుకుంది. తన ఇల్లు బ్యాంకులో వున్న డిపాజిట్లు, ఆమెకి బాకీ వున్న డబ్బు అంతా అన్నపూర్ణ వృద్ధాశ్రమానికి చెందాలని వీలునామా రాసి రిజిష్టర్ చేసింది" చెప్పాడు అశ్వత్థామ.

ఆస్తిమీద ఆశలు వదులుకున్న సీత, సుధాకర్ మూటముల్లె సర్దుకుని దుబాయ్ వెళ్ళిపోయారు. "కొంపముంచి పోయిందే ముసిల్ది" అని రంగయ్య లబోదిబోమన్నాడు.

కొన్నాళ్ళ తరువాత అన్నపూర్ణ వృద్ధాశ్రమం మేనేజర్ రంగయ్యకు లాయర్ నోటీసు పంపించాడు. 'పుణ్యవతి దగ్గర ఇల్లు తాకట్టుపెట్టి అప్పుగా తీసుకున్న ఏభైవేల రూపాయలు వడ్డీతో సహా చెల్లించవలెను. లేని ఎడల ఇల్లు వేలం వేయించి డబ్బు రాబట్టుకోగలము' అని అందులో సారాంశం.

రంగయ్యకు భూమి గిరగిరా తిరుగుతున్నట్లు భ్రాంతి కలిగి కళ్ళు తిరిగి పడిపోయాడు.

–జాగృతి వారపత్రిక *11-5-2009*